మినీ కథ

# ఇదెక్కడి బాధ?

విజయకుమారి

గోపాలరావు గారింట్లో పెళ్ళి. ఆఖరి పెళ్ళి కదా అని ఘనంగా చేస్తున్నా రాయన. ఏర్పాట్లన్నీ చురుగ్గా జరిగిపోతున్నాయి.

డబ్బుండాలే గాని పను లవడం ఎంత సేపు?

ఆ రోజు పెళ్ళి పిలుపుకు బయలు దేరుతున్నారు పెద్ద కూతురు శారద, పెద్ద కోడలు రాధిక, పెళ్ళికొడుకు మేనత్తలు, మరికొందరు ముత్తయిదువలు.

పెద్దంచు లున్న జరీ చీరలు, ఒంటి నిండా నగలు- ఒకరిని మించి మరొకరు ముస్తాబయ్యారు. అందరిలో కామాక్షి లేకపోవడం కాంతమ్మ గారి కింతో వెలితిగా ఉంది.

"నాలుగు రోజులు కూడా లేదు పెళ్ళి. ఇంకా రాలేదేమిటి కామాక్షీ వాళ్ళు! ఫలానా అప్పుడొస్తున్నామని కబురూ లేదు!" ఆవేదనగా అంది కాంతమ్మ గారు.

" సెలవు పెట్టి వారం రోజులు ముందుగా రావాలని మరీ మరీ చెప్పి వచ్చాను. ఎందుకు రాలేదో మరి!" అన్నారు గోపాలరావు గారు భార్యతో.

ఆయనకీ తోచడం లేదు చిన్న కూతురూ, చిన్నల్లుడూ ఇంకా రాలేదేమిటా అని. శారద, రాజశేఖర్ ఠంచనుగా పది రోజుల ముందే వచ్చారు. అన్ని పనుల్లో సాయపడుతున్నారు. వీళ్ళేమిటీ ఇలా?

"వస్తారు నాన్నగారూ- సెలవు దొరికిందో లేదో? గవర్నమెంటు ఉద్యోగం కదా మనలా సొంత వ్యాపారాలా కొట్టు కట్టేసుకు రాడానికి." బావమరిదిని సమర్థించాడు పెద్ద కొడుకు రవి.

"వెళ్ళొద్దామన్నా దగ్గరా దావూ కాదు. ఎక్కడి కాకినాడ, ఎక్కడి హైదరాబాదు! అందునా ఈ హడావుడిలో పని చెడి ఎవరు వెళతారు?" అన్నారు గోపాలరావు గారు ఏం చెయ్యడానికీ పాలుపోక.

ఎవరి పని వాళ్ళు చేసుకుపోతున్నా అందరి మనసులూ కామాక్షి, చంద్రాల మీదే ఉన్నాయి.

అందరికన్నా చిన్నదని కామాక్షి మీద ప్రేమ అయితే, చదువుకున్న వాడూ, సంస్కార వంతుడూ అని చంద్రం మీద అభిమానం.

నల్లగా, ఎంత తిన్నా ఎండుకుపోయినట్లు ఉండే కామాక్షికి ఏ సంబంధమూ కుదిరేది కాదు. పెద్ద పిల్ల శారదకు పది వేలి స్తేనే మారు మాట్లాడకుండా చేసుకున్నారు. కామాక్షికి పాతిక వేలిస్తానన్నా పెదవి విరిచి పోతున్నారే తప్ప సరేనన్న వాళ్ళు లేరు.

'ఈ పిల్లకు పెళ్ళి చెయ్యగలనా!' అని గోపాలరావుగారు బెంగ పెట్టుకున్న వేళ చంద్రంవాళ్ళ సంబంధం కుదిరింది. పైగా కట్న కానుకల ప్రసక్తి లేదు.

రాజశేఖర్‌లా అది కావాలి, ఇది కావాలి అని పేచీ పెట్టడని తెలిసిందే కాబట్టి ఈ పెళ్ళి కొచ్చినప్పుడు కలర్ టీ.వి. కొనివ్వాలని ముందే నిశ్చయించు కున్నారు కూడా.

రాజశేఖర్ రవి పెళ్ళికి టీ.వి. ఇ స్తే గాని రానని పేచీ పెట్టి కొనిపించు కున్నాడు. కామాక్షి పెళ్ళికి ఫ్రిజ్ మీద ప్లాను వేశాడు గాని, చంద్రం ఆదర్శం మూ లాన నోరు విప్పడానికి కుదిరింది కాదు.

అసలు అతని అల్లుడి వైభవానికి గ్రహణం పట్టింది కామాక్షి పెళ్ళి తరువాతే- "ఆదర్శం" అంటూ చంద్రం ఏదీ వద్దంటాడు. తనడిగితే ఆశపోతను కోరూ మరి?

శారద ద్వారా ఆ విషయం తెలుసుకున్న గోపాలరావుగారు ఆ ఫ్రిజ్ ఏదో ఇవ్వు డిద్దామనే అనుకున్నారు.

'ఏమిటో, వీళ్ళిద్దరూ రాకపోవడం కలతగా ఉంది' అనుకొని చిన్న కొడుకుతో "ఒరే రఘూ! బావగారి ఆఫీసుకి ట్రంక్ కాల్ చెయ్యరా ఈ పూట. అక్కడెలా ఉందో ఏమిటో..." అన్నారు ఒక నిశ్చయాని కొచ్చినట్లు.

"వాడెందుకు లెండి? పెళ్ళికొడుకుని చేశాం కదా! బయట తిరగ కూడదు. రవి వెళతాడులే" అంది కాంతమ్మ గారు.

ఇంతలో వాకిట్లో రిక్షా ఆగింది. అందులోంచి దిగుతున్న కామాక్షిని చూడగానే వాళ్ళ మొహాలు చేటంతయ్యాయి.

"మాటల్లోనే వచ్చింది. నూరేళ్ళాయుష్షు." సంబరంగా ఎదురెళ్ళా రంతా.

"అల్లుడు గా రేరీ? ఒక్కదానివే వచ్చావేం?" అన్నారు గోపాలరావు గారు.

సమాధానం చెప్పకుండా మొహం ఎర్రగా చేసుకుని విసవిస లోపలి కొచ్చింది కామాక్షి. అసలే చిన్న కళ్ళు మరింత లోతుకు పోయాయి. అన్నం తిని ఎన్ని రోజు లైందో అన్నట్లుంది నీరసంగా.

"ఏమిటే తల్లీ? ఏం జరిగిందమ్మా?" అన్న తల్లి పలకరింపుకు బావురుమని ఏడ్చేసింది.

అంత వరకూ బిగపట్టుకొన్న దుఃఖం కట్టలు తెంచుకుని వచ్చింది.

నిర్ఘాంత పోయా రంతా. సుస్మిత వద్దాక చెప్పిన సంగతులివి:

"మీ చిన్నన్నయ్య పెళ్ళి కాగానే భాగాలు పంచుకుంటారు. నీ వాటా నువ్వు రాయించుకో అన్నారు. నీ అందం చూసి మురిసిపోయి చేసుకున్నా ననుకున్నావా? పెద్ద బజార్లో ఉన్న పట్టుచీరల కొట్టు, మీరుంటున్న రెండంతస్తుల మేడ చూసి చేసుకున్నాం గాని. తనంతట తనే ఇ స్తే మర్యాద దక్కించుకున్నట్లే మీ నాన్న. లేకపోతే...." వెక్కిళ్ళ మధ్య అసలు విషయం బయట పెట్టింది కామాక్షి.

వాళ్ళింత మర్యాదగా వ్యవహరించి ఉంటారని తోచడం లేదు.

సామ దాన భేద దండోపాయా లుపయోగించి తరిమి ఉంటారు. హుఁ... కట్నం వద్దంటే ఆదర్శవంతుడనుకున్నాను. సమయం కోసం కాచుకున్నాడన్న మాట!

"దస్తావేజులతో వ స్తేనే ఇంట్లోకి ప్రవేశం; లేదా మీ నాన్న దగ్గరే పడుండు అన్నారు."

"ఇదెక్కడి కర్మండీ? అన్నులేమిటీ పంచుకోడాలేమిటీ? పెళ్ళికి మనమేం చెప్ప లేదుగా మగపిల్లలతో సమానంగా ఆస్తి రాసిస్తామని!" గగ్గోలు పెట్టింది కాంతమ్మ గారు.

"చెప్పలేదులే. అయితే ఏం? ఇప్పుడలా చట్టం వచ్చింది. ఆడా మగా అందరికీ సమానంగా ఇవ్వాలి" అన్నారు గోపాలరావు గారు. పది లంఖణాలు చేసినట్లు ఉంది ఆయన పరిస్థితి.

"పోని అక్కకీ, కామాక్షికి కూడా పంచండి. వాళ్ళు సుఖంగా ఉంటేనే కదా మనకీ సంతోషం..." అన్నాడు రఘు.

అతనికి కాబోయే భార్య ఒక్కత్తే కూతురు. అడిగినా మానినా ఆస్తి అంతా అతనికే వస్తుంది అత్త వారి తరఫుది. రవి మాత్రం తటస్థంగా ఊరుకున్నాడు. ఎప్పుడొచ్చినా అగ్గగ్గలాడుకుంటూ చూసే రాధిక కామాక్షి చెప్పిన మాటలు విన్నాక అంటీ ముట్టనట్లు ముభావంగా ఉంది.

రాజశేఖరానికి మాత్రం మహా సంతోషంగా ఉంది. నోరు తెరచి అడక్కుండా, మంచితనాన్ని పోగొట్టుకోకుండా ఆస్తిలో వాటా దానంతటదే తన్ను కుంటూ వస్తోంది.

పదేళ్ళు మీద పడ్డ వాడిలా డీలా పడి పోయిన తండ్రిని చూసి- "ఇదేదో జటిల సమస్యలా ఆలోచిస్తా రెందుకు నాన్నగారూ! అలాగేనని బావగారికి కబురు చేయండి పనులన్నీ అయ్యాక రాసుకుందాం అని" అన్నాడు రఘు తండ్రిని ఒత్తిడి చేస్తూ.

"పంచడానికి ఏముందనిరా ఇక్కడ? ఇది జటిల సమస్య కాక మరేంటి?" అన్నా రాయన విసుగ్గా.

బాంబు పేలినట్లు చూశారంతా! ఏమీ లేక పోవడమే మిటీ?

"అవును, లక్షల ఖరీదు చేసే బట్టల కొట్టుంది. కానీ దాని మీద పెట్టినదంతా నా జేబులోదా? సరుకు అరువు తెస్తుంటాను. అమ్మిన దాంట్లోంచి కొంత చెల్లించి మరి కొంత సరుకు తెస్తుంటాను. లాభాలే నావి కాని అంతా నాది కాదుగా!

"ఇక ఇల్లు. ఇద్దరమ్మాయిల పెళ్ళిళ్ళు, మీ చదువులు, మన హోదాకి తగిన ఖర్చులు ఎలా వచ్చాయి? వచ్చి పోయే బంధువులు, మర్యాదలు, పెద్దా చిన్నా కార్యాలు ఇన్నీ ఆ కొట్లో వచ్చే లాభాల తోనే జరిగాయా? ఇల్లు తనఖాలో ఉంది. నీ పెళ్ళి కూడా అయితే అట్టే ఖర్చులేం ఉండవు కదా. తీర్చు కోవచ్చన్న ధీమాతో అవసర పడ్డప్పుడంతా పదివేలు, పాతిక వేలు ఇంటి మీద తెచ్చాను.

"కొడుకులు ఆస్తికీ వారసులౌతారు, అప్పులకూ బాధ్యత వహిస్తారు- ఇష్టమున్నా లేక పోయినా. మరి అల్లుళ్ళు అందుకు సిద్ధపడతారా?

"పైకి వచ్చగా బిజినెస్ కనపడుతున్నది అందరికీ- మరి దాని వెనుక ఉన్న అప్పులో? మేడి పళ్ళ లాంటి వ్యాపారాలు, ఇళ్ళు, పొలాలు- వీటి నెలా పంచగలం? ఆస్తికి ఆశ పడేటప్పుడు దాంతో పాటు ఉండే సమస్యలకు కూడా సిద్ధపడాలి మరి!

"ఇప్పుడీ సమస్యకు పరిష్కార మేమిటో నువ్వే చెప్పు...." ఆవేశంగా అడిగారు గోపాలరావు గారు.

ఆలోచనలో పడ్డారంతా... ఏ చట్టం వచ్చినా మన దేశంలో ఆడపిల్లకు బెదరింపులూ భంగపాట్లూ తప్పవా అని.

★